PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 263 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 17 సెప్టెంబర్ 2026

ఓజోన్ పొర క్షీణతను అరికడదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



3లో

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆపదమిత్ర శిక్షణ కార్యక్రమం..



3లో

# సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు


- దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుని రావాల్సిన అవసరం ఉందని అన్నారు. పన్ను నిబంధనలలో మార్పుల కోసం వ్యక్తిగత ప్రయోజనాల ఆధారంగా కాకుండా వ్యవస్థకు ఉపయోగపడే రీతిలో విశ్లేషణాత్మక ప్రతిపాదనలతో ముందుకు రావాలని సూచించారు. బెంగళూరులో ఇంటర్నేషనల్ ట్యాక్స్ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ ఫౌండేషన్ 8వ అంతర్జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కొన్ని నిబంధనల వల్ల కొందరు పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలుగుతోందని అన్నారు. అయినప్పటికీ.. ఈ నిబంధనలు పన్ను వ్యవస్థ సమర్థతను దెబ్బతీసేలా ఉంటే వాటిని తొలగించాలనే గళాన్ని వినిపించే వాళ్లు మిగతా2లో...

# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

- యూఎల్‌సీ భూములపై త్వరలో కొత్త విధానం
- 22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించాం
- పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తాం
- పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తాం
- క్రమబద్ధీకరించిన, వేలం భూములకు విముక్తి
- ధరణి పేరిట గత ప్రభుత్వంలో దోపిడీ జరిగింది
- రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది
- బీఆర్ఎస్ భూములను ఇష్టారాజ్యంగా బదిలీ
- కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ చేస్తాం
- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి
- ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతాం
- ఫాంహౌస్ భూములపై 30 రోజుల్లో నివేదిక
- శాసనసభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన



**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** 22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. జీవో 166, జీవో 59, జీవో 58 కింద క్రమబద్ధీకరించిన భూములకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. వేలంలో కొనుగోలు మిగతా2లో...

# ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ



2లో

# 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి తప్పే
- హరీశ్‌రావు మామ భూములకు ఎలా జరిగింది?
- అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది హరీష్?
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫైర్



**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. "అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?" అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మిగతా2లో...

# ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

- ఈ ఏడాది అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు లక్ష్యం
- ఉద్యాన రంగ అభివృద్ధికి రూ.1,000 కోట్లతో కార్యాచరణ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి


2లో



# యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

- కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) మిగతా2లో...



# పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

- కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం
- 51 లక్షల మంది లబ్ది పొందే చాన్స్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** దేశంలో పనిచేస్తున్న కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన వార్త అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోకి వచ్చే సేవకుల వేతన పరిమితిని భారీగా పెంచుతూ కేంద్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. మిగతా2లో...

# ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే...

- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత విమర్శ



2లో

# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

- సీఎం కుటుంబానికి 308 ఎకరాల భూమి
- కాంగ్రెస్ అక్రమాలు బయటపెడతామనే మాపై సస్పెన్షన్
- భూభారతి, 22ఏపై సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్




**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి కుటుంబానికి 308 ఎకరాలు భూమి ఉందన్నారు. వెల్దండ మండలం కొొట్ర గ్రామంలోనే 175 ఎకరాలు, వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో 79 ఎకరాలు, ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఇతర భూమి 54 మిగతా2లో...

# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు. ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అదే భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటా మాఫియా చేతిలో బీఆర్ఎస్ నాయకులు పెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ధరణిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేశామని గొప్పలు చెప్పారని, ఆయన చెప్పింది పచ్చి అబద్ధమని సీఎం మండిపడ్డారు. ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారం బదిలీ చేసుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తప్పు చేసిన వారు సభకు రాకుండా తప్పించుకుందామనే చూస్తారని సీఎం ఎద్దేవా చేశారు. పట్టుకుని రమ్మని ఆదేశాలిస్తే తప్ప కేసీఆర్ సభకు వచ్చేటట్టు లేరని అన్నారు. రెవెన్యూ సమాచారం కేంద్ర సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేటుకు ఎందుకు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. రూ. 110 కోట్ల విలువైన కాంట్రాక్టు రూ.1400 కోట్ల వాల్యూకు ఎలా వచ్చిందన్న సీఎం, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. 1982లో వచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పాటు కాగానే కేసీఆర్ రద్దు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే సభ నుంచి పారిపోయారని విమర్శించారు. 2021 నాటికి 21 లక్షల 93వేల 50 ఎకరాలను పార్టు బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2023 నాటికి ధరణితో తెలంగాణ సమాజానికి కేసీఆర్ గుండు కొట్టారని విమర్శించారు. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు విచ్చల విడిగా సంపాదించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని రేవంత్ రెడ్డి అన్నారు. కండువా వేస్తే బీఆర్ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అభివర్ణించారు. అధికారంలోకి వచ్చాక భూముల సమస్య పరిష్కారం కోసం తలలు బద్దలు కొట్టుకున్నామన్నారు. తెలంగాణకు చెందిన 2.5కోట్ల ఎకరాల భూమి డేటా మాఫియా చేతికి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సభలో ఉన్నప్పుడే 22ఏ బండారం బయటపెట్టాలని భావించానని తెలిపారు. ఆ విషయం తెలిసి కావాలనే బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యేలా వ్యవహరించారన్నారు. బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ధరణి 2010లో ఒడిశాలో మొదలైందని రేవంత్ రెడ్డి అన్నారు. 2014లో కాగ్? ధరణిపై తీవ్రంగా ఆక్షేపించిందన్నారు. 2018లో ధరణి కాంట్రాక్టును ఐఎల్?ఎఫ్?ఎస్? దక్కించుకుందని వివరించారు. ఐఎల్?ఎఫ్ఎస్?, ధరణిని టెరాసిస్ అనే కంపెనీకి అమ్ముకుందని విమర్శించారు. టెరాసిస్ కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు.మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్‌నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాల చొప్పున ఉందని వివరించారు. రేవంత్‌రెడ్డి కుటుంబ భూముల వివరాలు అన్ని త్వరలో మరిన్ని బయటకి వస్తాయని చెప్పారు. ప్రజల సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే, డైవర్షన్ రాజకీయాలకు సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కుట్రపూరితంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని చెప్పారు. ప్రభుత్వ అక్రమాలను బయటపెడతామనే సభలో లేకుండా చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడినవన్నీ అర్ధసత్యాలు, అబద్ధాలని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటుకు టీ షర్ట్, స్టిక్కర్లు వేసుకుని వెళ్తే ఒప్పు, తాము టీ షర్టు వేసుకుని అసెంబ్లీకి వస్తే తప్పా? అని ప్రశ్నించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియమాలు వేరా? అని అడిగారు.

**పథకం ప్రకారమే గెంటేశారు**

వృద్ధులకు రూ.నాలుగు వేల పెన్షన్, మహిళలకు రూ.2500 ఇవ్వలేదనీ, విద్యార్థులకు భరోసా కార్డు ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు.ఈ వైఫల్యాలను టీ షర్ట్ మీద రాసుకొస్తే తమను సస్పెండ్ చేశారని అన్నారు. తాము కావాలని అసెంబ్లీ నుంచి బయటకు రాలేదనీ, పక్కా పథకం ప్రకారమే గెంటేశారని విమర్శించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికి, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగితే.. కనీసం మైక్ ఇవ్వాలని అడిగినందుకు సస్పెండ్ చేశారని అన్నారు. తాము సభలో ఉంటే కాంగ్రెస్ కుంభకోణాలు, రేవంత్‌రెడ్డి కుటుంబ అవినీతి బయటపడుతుందనే భయంతోనే మొత్తం సెషన్‌కి తమను సస్పెండ్ చేశారని వివరించారు. సస్పెన్షన్ ఎత్తేస్తే ఆధారాలతో సభకు వస్తామని తమ ఎమ్మెల్యేలు సవాల్ చేశారని గుర్తు చేశారు. సీపీఐ, బీజేపీలు అడిగినా సస్పెన్షన్ ఎత్తేసే దమ్ము సీఎంకు లేదన్నారు.

# ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఉద్యాన పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం శాసనసభలో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వివిధ పథకాల కింద అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. పండ్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర పంటల వైపు రైతులను మళ్లించేందుకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యాన పంటల సాగు విస్తరణకు అవసరమైన మొక్కలు, ఎరువులు, మల్చింగ్, షేడ్‌నెట్, ఫామ్‌పాండ్లు, శీతల గిడ్డంగులు, శాశ్వత పందిళ్లు, బిందు, తుంపర సేద్యం వంటి సదుపాయాలను నిబంధనల ప్రకారం 40 శాతం నుంచి 90 శాతం వరకు రాయితీపై అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. 2026--27లో మొక్కలు, మల్చింగ్, షేడ్‌నెట్, కోత అనంతర నిర్వహణ సదుపాయాలు, శీతల గిడ్డంగులు, ఉద్యాన యాంత్రీకరణ, శాశ్వత పందిళ్ల కోసం రూ.150 కోట్లు, బిందు, తుంపర సేద్యం కోసం రూ.243 కోట్లు, ఆయిల్‌పామ్ అభివృద్ధికి రూ.261 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 88,282 మంది రైతులు 3.20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని మంత్రి తెలిపారు. చీవీజూ-ూా పథకం కింద 2021--22 నుంచి ఇప్పటివరకు 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. 2023 డిసెంబర్ నుంచి 1.37 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తరించామని చెప్పారు. 2026--27 సంవత్సరానికి 85 వేల ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 29,053 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు మంత్రి వెల్లడించారు. సాంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు ఉన్న ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణలో భాగంగా ప్రభుత్వం ఈ పంటను ప్రోత్సహిస్తోందన్నారు. రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు మొక్కలు, డ్రిప్, మొదటి నాలుగేళ్లకు ఎరువులు, అంతర పంటల సాగు తదితరాలకు కలిపి ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఫామ్‌పాండ్లు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కూడా రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ చట్టం--1993 ప్రకారం ఫ్యాక్టరీ జోన్ కేటాయించిన ప్రతి ఆయిల్‌పామ్ కంపెనీ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రతి నెలా ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.24,025 ధర ఉందన్నారు. కనీస హామీ ధర (వీ+ూ) ప్రకటించాల్సింది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, అయినప్పటికీ రైతులకు మరింత భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని వీ+ూ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు.

# ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే...

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు.

కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ - గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

# సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు అవసరం అయ్యారని వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, పన్నుల వసూళ్ల రంగానికి దీర్ఘకాలి కంగా ప్రయోజనం చేకూర్చే అంశాలపైనే ప్రతి ఒక్కరూ ప్రధానంగా దృష్టి సారించాలని నిర్మల సీతారామన్ చెప్పారు. పన్ను నిబంధనల సవరణలపై ప్రతిపాదనలు చేసేటప్పుడు పూర్తి సమాచారంతో కూడిన నివేదికలను సమర్పించాలని కోరారు. ఏదైనా నిబంధన వల్ల పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం పడుతుంటే, దాని వల్ల ఎంతమంది ప్రభావితమవుతున్నారు, ఎంత సమయం, వ్యయం వృథా అవుతుందనే వివరాలను గణాంకాలతో సహా నిరూపించాలని కోరారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటో కూడా ప్రతిపాదించాలని, ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఆదాయంపై పడే ప్రభావాన్ని నిశితంగా అంచనా వేయాలని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. వీటి వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుంది, పన్ను పరిధి ఏ మేరకు ప్రభావితమవుతుంది, పన్నుల నిర్వహణపై ఎలాంటి ఫలితాలు ఉంటాయనే విషయాన్ని సమగ్రంగా విశ్లేషించడం ఎంతైనా అవసరమని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పన్ను విధానాలను సరళీకరిస్తూనే, దేశ ఆర్థిక వృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటోందని గుర్తుచేశారు. నిబంధనల మార్పు ఒక వర్గానికి మాత్రమే కాకుండా, మొత్తం ఆర్థిక రంగానికి మేలు చేసేలా ఉన్నప్పుడే నిజమైన సంస్కరణలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. పన్నుల పరిధిని విస్తృతం చేస్తూనే, విధానపరమైన అడ్డంకులను తొలగించడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

# యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

(మొదటి పేజీ తరువాయి)

విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక్ సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50-55 కోట్లకు చేరిందని తెలిపారు.

# పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు నెలకు రూ. 15,000 ఉన్న ఈ పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని ఏకంగా రూ. 25,000కు పెంచుతూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ సంచలన నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుందని ఆయన తెలిపారు. ఈ సామాజిక భద్రతా పథకం విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తరఫున రూ. 11,339 కోట్ల నిధులను ఖర్చు చేయబోతోంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17 నుంచే అమలులోకి రానుంది. గతంలో 2004 నుంచి 2014 వరకు పీఎఫ్ వేతన పరిమితి ఎలాంటి మార్పు లేకుండా కొనసాగింది. అనంతరం సెప్టెంబర్ 2014లో దీనిని రూ. 15,000కు పెంచారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రూ. 25,000కు పెంచడం విశేషం. అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలు ఇప్పటికే రూ. 15,000 కంటే దాటిపోయిన నేపథ్యంలో 2014 పరిమితి కాలం చెల్లినదైందని, అందుకే సమగ్ర సంప్రదింపుల తర్వాత ఈ సీలింగ్‌ను రూ. 25 వేలకు పెంచినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రూ. 15,000 కంటే ఎక్కువ జీతంతో కొత్తగా ఉద్యోగంలో చేరే చాలామందికి పీఎఫ్, పెన్షన్, సంబంధిత బీమా రక్షణ లభించేది కాదు. తాజాగా వేతన సీలింగ్‌ను రూ. 25,000కి పెంచడం వల్ల రూ. 15,000 నుంచి రూ. 25,000 మధ్య సంపాదించే మధ్యతరగతి ఉద్యోగులందరూ ఇకపై చట్టబద్ధంగా ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. ఇది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచడమే కాకుండా, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు తమ సిబ్బందికి మెరుగైన సామాజిక భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది.

# ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

**హైదరాబాద్,సెప్టెంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

# 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

# అంబేద్కర్ చరిత్రను వక్రీకరించొద్దు

**విద్య నుంచి రాజ్యాంగ నిర్మాణం వరకు ఆయన ప్రస్థానం స్ఫూర్తిదాయకం**

**పుస్తకంపై ప్రభుత్వ స్థాయిలో పరిశీలన జరపాలి: సీపీయూఎస్ఐదళిత బహుజన శ్రామిక విముక్తి వరంగల్ జిల్లా కార్యదర్శి గడ్డం శరత్**





**హనుమకొండ, సెప్టెంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితాన్ని, ఆయన సామాజిక ఉద్యమాలను, రాజ్యాంగ నిర్మాణం లో చేసిన కృషిని వక్రీకరించే ప్రయత్నాలు సమాజంలో అనవసరమైన అపోహలకు దారితీస్తాయని సీపీయూఎస్ఐదళిత బహుజన శ్రామిక విముక్తి వరంగల్ జిల్లా కార్యదర్శి గడ్డం శరత్ అన్నారు. అంబేద్కర్‌ను అవమానించే విధంగా వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొంటున్న పుస్తకాన్ని తెలంగాణ ప్రభుత్వం పరిశీలించి, చట్టపరంగా తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. అంబేద్కర్ అంటే కేవలం రాజ్యాంగ రచయిత మాత్రమే కాదని, విద్యను సామాజిక మార్పుకు ఆయుధంగా మలిచిన సంస్కర్త, ఆర్థికవేత్త, న్యాయవాది, రాజకీయ నాయకుడు, సామాజిక న్యాయం కోసం పోరాడిన ఉద్యమకారుడని శరత్ పేర్కొన్నారు. అత్యంత ప్రతికూల సామాజిక పరిస్థితుల్లో విద్యను కొనసాగించిన అంబేద్కర్ కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. ఆయన ఆర్థిక, రాజకీయ, న్యాయ రంగాల్లో చేసిన పరిశోధనలు ఆయనను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పండితుడిగా నిలబెట్టాయని అధికారిక జీవిత చరిత్రలు పేర్కొంటున్నాయి. **అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం** సామాజిక వివక్షకు వ్యతిరేకంగా అంబేద్కర్ నిరంతర పోరాటం సాగించారని శరత్ అన్నారు. దళితుల రాజకీయ ప్రాతినిధ్యం, విద్య, ఉపాధి, సామాజిక సమానత్వం వంటి అంశాలను ఆయన జాతీయ స్థాయి చర్చల్లోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాల్లో అంబేద్కర్ అణగారిన వర్గాల సమస్యలను ప్రస్తావించారని, 1932 సెప్టెంబర్ 24న కుదిరిన పూణే ఒప్పందం ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలక ఘట్టమని ప్రభుత్వ ఆధారాలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. **రాజ్యాంగానికి సామాజిక న్యాయ దృక్పథం** 1947లో రాజ్యాంగ ముసాయిదా కమిటీకి అధ్యక్షత వహించిన అంబేద్కర్, సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, హక్కులకు ప్రాధాన్యమిచ్చే రాజ్యాంగ నిర్మాణంలో కీలక బాధ్యత నిర్వర్తించారని శరత్ అన్నారు. స్వతంత్ర భారత తొలి న్యాయశాఖ మంత్రిగా కూడా ఆయన సేవలందించారని గుర్తుచేశారు. అంబేద్కర్ ఆర్థిక ఆలోచనలు కూడా దేశ నిర్మాణంలో ప్రభావం చూపాయని ఆయన తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ, కరెన్సీ, ఆర్థిక వికేంద్రీకరణ వంటి అంశాలపై అంబేద్కర్ చేసిన పరిశోధనలు ప్రస్తావించదగినవని అధికారిక వనరులు పేర్కొంటున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూపకల్పనకు సంబంధించిన చర్చల్లో ఆయన ఆర్థిక ఆలోచనలకు ప్రాధాన్యం ఉన్నట్లు ప్రభుత్వ ప్రచురణలు పేర్కొన్నాయి. అంబేద్కర్ వారసత్వాన్ని కేవలం విగ్రహాలు, జయంతి వేడుకలకే పరిమితం చేయకుండా ఆయన ప్రతిపాదించిన విద్య, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలను ఆచరణలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని గడ్డం శరత్ అన్నారు. చారిత్రక వ్యక్తులపై రచనలు చేసేటప్పుడు ఆధారాలు, పరిశోధన, వాస్తవ నిర్ధారణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. అంబేద్కర్ చరిత్రపై వివాదాస్పదంగా ఉన్న అంశాలపై ప్రభుత్వం సంబంధిత వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని గడ్డం శరత్ కోరారు.

---

# బాలల సమస్యలను సానుభూతితో పరిష్కరించాలి

**సంరక్షణ కేంద్రాల్లో సౌకర్యాలపై న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ ఆరా**






**హనుమకొండ, సెప్టెంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** సంరక్షణ అవసరమైన బాలలకు మెరుగైన వసతి, విద్య, వైద్యం, భద్రతతో పాటు అవసరమైన న్యాయ సహాయం అందేలా చూడాలని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ సూచించారు. బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణపై సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. వరంగల్ ఆటోనగర్‌లోని పరిశీలన గృహాన్ని సందర్శించిన కందుకూరి పూజ అక్కడి నిర్వహణ తీరును, రికార్డులను పరిశీలించారు. అనంతరం దేశాయిపేటలోని ఇండియన్ డిసిపుల్స్ మిషన్ చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించి బాలలతో మాట్లాడారు. వారి రోజువారీ అవసరాలు, విద్య, ఆరోగ్యం, భోజనం, వసతి, భద్రతకు సంబంధించిన అంశాలను స్వయంగా తెలుసుకున్నారు. బాలలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రతి బాలుడికి రక్షణతో పాటు గౌరవప్రదమైన వాతావరణం కల్పించడం, వారి అవసరాలను సానుభూతితో పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా సఖీ వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించిన న్యాయమూర్తి, బాధిత మహిళలకు అందుతున్న న్యాయ, వైద్య, కౌన్సెలింగ్, పోలీస్ సహకారం, పునరావాస సేవలపై సమీక్షించారు. సంబంధిత రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేసి, బాధితులకు అవసరమైన సహాయం సకాలంలో అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. బాలలు, మహిళల హక్కుల పరిరక్షణ కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం పనిచేస్తుందని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ తెలిపారు. న్యాయ సహాయం అవసరమైన అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు.

---

# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆపదమిత్ర శిక్షణ కార్యక్రమం..






**హనుమకొండ సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం మరియు రాష్ట్ర విపత్తుల ప్రతిస్పందన దళం (రాణ=ఖీ )ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ఆపదమిత్ర శిక్షణ కార్యక్రమం ఈరోజు 4వ పోలీస్ బెటాలియన్ మామునూరు లో ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమానికి కాకతీయ ప్రభుత్వ కళాశాల(స్వయం )నుండి 36 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 16 నుండి 22 వరకు జరగనున్న ఈ శిక్షణ కార్యక్రమంలో ఆపద సమయంలో ఏ విధంగా స్పందించాలి,ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను ఏ విధంగా కాపాడాలి,ప్రాణనష్టాన్ని ఆస్తి నష్టాన్ని తగ్గించడానికి చేయవలసిన మెలకువలను వాలంటీర్లు నేర్చుకుంటారు. కాకతీయ విశ్వవిద్యాలయం తరుపున కళాశాల నుండి 36 మంది విద్యార్థులు వాలంటీర్లుగా ఎంపికైనందుకు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ ఎస్ ఎస్ తరుపున పాల్గొనే 104 మంది విద్యార్థులకు కాంటినెంట్ లీడర్ గా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. బాసాని సీతారాములు వ్యవహరిస్తున్నారు . ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.గంగిశెట్టి శ్రీనివాస్ డా. గన్ సింగ్ డా. మాలతిలత, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డా. రవికుమార్ పాల్గొన్నారు.

---

# రామడుగు గ్రామంలో ఆయుర్వేదిక్ హెల్త్ క్యాంప్ విజయవంతం..



**రామడుగు సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):**
ఈ రోజు రామడుగు గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రభుత్వ ఆయుర్వేదిక్ సెంటర్ వారి ఆధ్వర్యంలో ఆయుర్వేదిక్ హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసి మోకాళ్ళ నొప్పులు,కీళ్ళ నొప్పుల,నరాల బలహీనత ఏటువంటి వ్యాధి కి అయినా ఆయుర్వేదిక్ చికిత్స చేసి మందులు పంపిణీ చేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహమ్మద్ మొహీజ్ మరియు ఉప సర్పంచ్ పేందోట రాజు కార్యదర్శి శ్రీనివాస్ మరియు పాలకవర్గం వార్డు సభ్యులు మామిడి దిలీప్ కుమార్, ఎండి ఆరీఫ్,కర్నె శ్రీలత -శ్రీనివాస్,సిరికొండ పల్లవి - సాయితేజా, మ్యాడారం అర్చన - అనిల్,రాగం స్వప్న - రవి,కారుపాకల నరేష్,సామంతుల సుజాత - తిరుపతి,చంద అనిల్,మామిడి శ్రవణ్,నీలం అరుణ - లక్ష్మణ్,మామిడి కుమార్, సిరిగిరి వెంకటేశం మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది,గ్రామస్తులు ,డాక్టర్ లు ఆయుర్వేదిక్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు

---

# ఓజోన్ పొర క్షీణతను అరికడదాం..
# పర్యావరణాన్ని పరిరక్షిద్దాం






**పరకాల, సెప్టెంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓజోన్ పొర క్షీణతకు గల కారణాలు, దాని వల్ల మానవాళి, జీవరాశులు, పర్యావరణంపై కలిగే దుష్పరిణామాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. సంతోష్ కుమార్ మాట్లాడుతూ విరివిగా చెట్లు పెంచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, రిఫ్రిజిరేటర్లు, ఏసీల వినియోగంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఓజోన్ పొరను కాపాడేందుకు విద్యార్థులు, అధ్యాపకులు ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ అశోక్ అలీషాల మాట్లాడుతూ ఓజోన్ పొర క్షీణత వల్ల మానవాళి, జీవరాశుల మనుగడకు పొంచి ఉన్న ప్రమాదాలను వివరించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి. రామకృష్ణ మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ కారణంగా పర్యావరణ వ్యవస్థల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఇవి జీవరాశుల మనుగడపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ జగదీష్ బాబు విద్యార్థులతో ఓజోన్ పొర పరిరక్షణ, పర్యావరణ సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

---

# హుజురాబాద్‌లో మాజీ రాజ్యసభ సభ్యులు స్వర్గీయ వోడితల రాజేశ్వరరావు జయంతి

- హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు ఘన నివాళి





**హుజురాబాద్, సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గంలో మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ వోడితల రాజేశ్వరరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు, హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని పాల్గొని వోడితల రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి, హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి వోడితల రాజేశ్వరరావు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషిని హుజురాబాద్ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీ రాణి, నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

---

# ఒంటరి మహిళలకు అండగా స్ఫూర్తి ఫౌండేషన్

- దివ్యాంగురాలు, ఒంటరి మహిళలకు తోపుడు బండ్ల పంపిణీ





**కల్లూరు, సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్, బత్తులపల్లిలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒంటరి దివ్యాంగురాలు, ఒంటరి మహిళలకు నాలుగు చక్రాల తోపుడు బండ్లను పంపిణీ చేశారు. స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ ఉయ్యూరి శ్రీవ్యాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శాంతినగర్‌కు చెందిన ఖమ్మంపాటి నాగేశ్వరి దివ్యాంగురాలు కావడంతో పాటు పెన్షన్‌పైనే జీవనం సాగిస్తున్నారు. ఆమెకు ఆర్థికంగా చేయూతనిస్తూ చిరు వ్యాపారం చేసుకుని స్వయం ఉపాధి పొందేందుకు తోపుడు బండిని అందజేశారు. అదేవిధంగా బత్తులపల్లికి చెందిన పోతిని సుశీలకు కూడా తోపుడు బండిని అందించారు. పాఠశాలల్లో సమస్యలపై ఆరా గత నెలలో ఎకం ఫౌండేషన్ సహకారంతో కల్లూరు పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు అందించిన 50 డ్యూయల్ డెస్క్ బెంచీలను స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు పరిశీలించారు. వాచ్చానాయక్ తండా, జిడిబిపల్లి, కలాలివాడ, జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల, బత్తులపల్లి ఎంపీపీఎస్ తదితర పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లో బెంచీలను పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందించేందుకు స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉయ్యూరి శ్రీవ్యాల్, ఉయ్యూరి శత్రుఘ్నుడు, రామలక్ష్మి, కల్లూరు స్ఫూర్తి ఫౌండేషన్ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు సాధించిన రోకటి సుష్మకు అభినందనలు

● వైద్య విద్యలో సుష్మ సాధించిన విజయం అభినందనీయం: శెట్టి రంగారావు



ఖమ్మం, ప్రతినిధి సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్): జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన మున్నూరు కాపు బిడ్డ రోకటి సుష్మ ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు సాధించడం పట్ల మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు దంపతులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు. సుష్మ సాధించిన విజయం గ్రామానికి, తల్లిదండ్రులకు, సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. సుష్మకు ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు లభించిన విషయం తెలుసుకున్న శెట్టి రంగారావు దంపతులు ఆమె స్వగ్రామమైన పాపకొల్లుకు వెళ్లి సుష్మను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శెట్టి రంగారావు మాట్లాడుతూ వైద్య విద్య ఎంతో ఖర్చుతో కూడుకున్నదని, అలాంటి ప్రతిష్టాత్మకమైన ఎంబీబీఎస్ కోర్సులో సుష్మ ఉచిత సీటు సాధించడం గొప్ప విజయమని కొనియాడారు. పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సుష్మను ఆకాంక్షించారు. అలాగే ఇద్దరు ఆడపిల్లలను ఎంతో కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులు రోకటి ప్రమీల, రమేష్‌లను కూడా ఈ సందర్భంగా శెట్టి రంగారావు దంపతులు అభినందించారు.

# నేడే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

● జాతీయ జెండాను ఆవిష్కరించనున్న ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్


● సీరోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుడిగం లక్ష్మీనారాయణ పిలుపు



సీరోల్, సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17వ తేదీన మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సీరోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు, సీరోల్ మండల కమిటీ నాయకులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ గ్రామ అధ్యక్షులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని లక్ష్మీనారాయణ కోరారు. కాంగ్రెస్ శ్రేణులంతా సమన్వయంతో పాల్గొని తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# చొప్పదండి మండలంలో కరెంటు సక్రమంగా సరఫరా చేయాలి..

- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి....



గంగాధర సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్): చొప్పదండి మండలంలో ప్రభుత్వ అసమర్థతతో కరెంట్ సరఫరా అస్తవ్యస్తంగా మారిందని కరెంట్ కోతలకు స్థానిక శాసన సభ్యులు మేడిపల్లి సత్యం భాధ్యత వహించాలని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎంపిటిసి సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ చొప్పదండి రూరల్ శాఖ అధ్యక్షులు మొగిలి మహేష్ ఆధ్వర్యంలో చొప్పదండి లోని ఒక ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరెంటు కోతలు మండలంలోని అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో నిత్యకృత్యంగా మారాయని రైతులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకునే నాథుడు లేడని నియోజకవర్గ కేంద్రంలోనీ సబ్ స్టేషన్ లో సబ్ ఇంజనీర్ పోస్ట్ ఖాళీగా ఉందని ఆరుగురు లైన్మెన్ లకు గాను ముగ్గురు లైన్మెన్లు మాత్రమే ఉండడంతో చొప్పదండి సెక్షన్ పరిధిలో విద్యుత్తు సరఫరా అస్తవ్యస్తంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీ అనుచరులకు పదవులు కట్టబెట్టడంలో ఉన్న శ్రద్ధ అత్యవసర సేవలు అయినటువంటి విద్యుత్ విభాగంలో లైన్మెన్ లో నియమించడంలో ఎమ్మెల్యేకు లేకపోవడం శోచనీయమని కృష్ణారెడ్డి ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలో అనేక వాడల్లో లోవోల్టేజి సమస్య ఉందని మున్సిపల్ ఎన్నికలలో హైవోల్టేజ్ ఉపన్యాసాలు ఇచ్చిన అధికార పార్టీ నాయకులు ఇప్పుడు లోవోల్టేజీ సమస్యను పరిష్కరించకపోవడం శోచనీయమని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పని తీరు వలన కాళేశ్వరం నీళ్లు కాలువల్లో రాకపోవడంతో రైతులు నీటికి ఇబ్బంది పడుతున్నారని కనీసం బావులలో ఉన్న నీటితో పంటలు కాపాడుకుందాం అంటే కరెంటు కోతలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బ్రేక్ డౌన్ వస్తె బాగుచేసే సిబ్బంది లేరని, అనేకచోట్ల ట్రాన్స్ఫార్మర్ల కెపాసిటీ పెంచాలని పవర్ సమస్యలు పరిష్కరించకపోతే రాబోవు ఎన్నికల్లో రైతులు అధికార పార్టీ, పవర్ కట్ చేస్తారని ఫ్యూజులు తొలగిస్తారని తక్షణం విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో బిజెపి దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు గుమ్లాపూర్ మాజీ ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాయణ, భూపాలపట్నం మాజీ ఉపసర్పంచ్ బైరాగోని కిట్టు గౌడ్, గుమ్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ విలాసాగరం అంజయ్య, మండల ప్రధాన కార్యదర్శిలు కొమ్ము రమేష్ ,ఎడ్ల సురేష్, గన్ను నరసింహారెడ్డి, కాయిత సాయి కృష్ణ, ఐద మారుతి ,యువ మోర్చ మండల అధ్యక్షులు పెద్ది వీరేశం, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మడిపల్లి రాజు, ముద్దం చందు, గొల్లపల్లి ముని, మ్యాకల రాములు తదితరులు పాల్గొన్నారు.

# నిజాంల నిరంకుశ పాలన నియంతృత్వానికి మారుపేరు: డాక్టర్ సమత

ఆపరేషన్ పోలోతోనే హైదరాబాద్ సంస్థానానికి విముక్తి

నాటి పోరాట చరిత్రను పాలకులు మరుగున పరుస్తున్నారు: బీజేపీ ఆగ్రహం



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :నాటి హైదరాబాద్ సంస్థానంలో నిజాంల పాలన నియంతృత్వానికి, అరాచకాలకు మారుపేరుగా సాగిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సమత విమర్శించారు. రజాకార్ల అకృత్యాలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటాల ఫలితంగానే హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా బర్కత్ పుర లో ఆమె మాట్లాడుతూ దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చి యావత్ భారతావని సంబరాలు చేసుకుంటుంటే, హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాంల చేతిలో బందీగా ఉండి స్వేచ్ఛ కోసం పోరాడాల్సి రావడం అత్యంత దురదృష్టకరమన్నారు. నిజాం అండతో ఖాసిం రజ్వీ ఆధ్వర్యంలోని రజాకార్లు సాగించిన మారణకాండకు భైరాన్‌పల్లి, పరకాల, వెయ్యి ఊడల మర్రి వంటి ప్రాంతాలు ఇప్పటికీ సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని గుర్తుచేశారు. నాటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దృఢ సంకల్పంతో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' సైనిక చర్య సెప్టెంబర్ 13న ప్రారంభమై, సెప్టెంబర్ 17న నిజాం మెడలు వంచిందని, దీంతో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని వివరించారు. నాటి సంస్థానంలో తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకలోని పలు ప్రాంతాలు ఉండేవని, ఈ ప్రాంత ప్రజలు చేసిన వీరోచిత పోరాటాలను, అమరుల త్యాగాలను గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజకీయ లబ్ధి కోసం మరుగున పడేస్తున్నాయని ఆరోపించారు. నిజాం అరాచకాలను ఎదిరించి దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, కాళోజీ నారాయణరావు, కొమురం భీమ్, రావి నారాయణరెడ్డి, సర్దార్ సర్వాయి పాపన్న వంటి ఎందరో యోధులు ప్రాణాలర్పించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. సెప్టెంబర్ 17 అనేది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ దినమని, నాటి నిరంకుశ పాలన, అమరవీరుల త్యాగాల గురించి భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ సమత స్పష్టం చేశారు.

# గిరిజనుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది కేసీఆర్

తండాలను ప్రత్యేక పంచాయతీలుగా మార్చారు

గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించారు:

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య




కల్లూరు, సెప్టెంబరు 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :తెలంగాణ రాష్ట్రంలోని గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. బుధవారం కల్లూరులో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచినట్లు తెలిపారు. రిజర్వేషన్లు పెంచి ఆరేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గంలోని లంబాడీ తండాలు, ఆదివాసీ గూడేల్లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో ఎస్టిలకు 10 శాతం రిజర్వేషన్ అమలులో ఉన్నట్లు ప్రభుత్వ అధికారిక విద్యా ప్రవేశ పత్రాల్లోనూ పేర్కొంటున్నారు. **తండాలకు ప్రత్యేక పంచాయతీల హోదా** కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 500కు పైగా జనాభా ఉన్న తండాలు, గూడేలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడారని సండ్ర అన్నారు. వాటి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారని తెలిపారు. గిరిజనులు సాగు చేస్తున్న బంజరు, పోడు భూములకు పట్టాలు అందించడంతో పాటు గిరి వికాసం పథకం ద్వారా భూములను సాగులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. **విద్య, ఉపాధికి ప్రాధాన్యం** బంజారా సమాజం కోసం హైదరాబాద్‌లో ప్రత్యేక బంజారా భవనం నిర్మించారని సండ్ర తెలిపారు. గిరిజన విద్యార్థుల కోసం గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసి ఉన్నత విద్యకు ఐఐటీ, నీట్ కోచింగ్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ వంటి అవకాశాలు కల్పించారని అన్నారు. గిరిజన ఆవాస ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్, తాగునీరు, సాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించినట్లు తెలిపారు. గిరిజన యువతకు డ్రైవర్ ఎంప్లాయిమెంట్, ఈ-హబ్‌ల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు అందించారని చెప్పారు. ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌కు చట్టబద్ధత కల్పించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. **కాంగ్రెస్ హామీలపై సండ్ర విమర్శలు** 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని సండ్ర ఆరోపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పోడు భూముల పట్టాలు ఇస్తామని, తుకారాం ఆదివాసీ, సంత్ సేవాలాల్, ఎరుకల పేర్లతో మూడు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. గిరిజనుల అభివృద్ధికి కొత్తగా ఐదు ఐటీడీఏ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామని చెప్పి ఆ హామీని కూడా విస్మరించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జరుపుల లీలావతి, ఎర్రబంజర సర్పంచ్ గుగులోతు శ్రీను, మాజీ సర్పంచులు బానోతు బాబు, మాన్సింగ్, రాములు, పార్టీ ఉపాధ్యక్షులు బానోతు కృష్ణ, అజ్మీర జమలయ్య, బానోతు బాలు, ఎస్టీ నాయకులు నేపాల్ కృష్ణ, లక్ష్మణ్, ప్రసాద్, రాములు, బీఆర్ఎస్ కౌన్సిలర్ లక్కినేని రఘు, బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు, కౌన్సిలర్ పెదకంటి రామకృష్ణ, కౌన్సిలర్ మహమ్మద్ ఇస్మాయిల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# మూడు డివిజన్లలో రూ.1.85 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ చేతుల మీదుగా పనులకు శ్రీకారం



కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 16(పిసి డబ్ల్యూ న్యూస్): నగరంలోని మౌలిక వసతుల అభివృద్ధికి కరీంనగర్ నగరపాలక సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా 13, 42, 49వ డివిజన్లలో యూఐడీఎఫ్, ఎంజీఎఫ్ నిధులతో చేపట్టనున్న మొత్తం రూ. 1.85 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 13వ డివిజన్ శివనగర్‌లో బైపాస్ రోడ్డులో లారెల్ స్కూల్ సమీపంలో యూఐడీఎఫ్ నిధులతో రూ. 75 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 42వ డివిజన్ భాగ్యనగర్‌లో మమత థియేటర్ సమీపంలో యూఐడీఎఫ్ నిధులతో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే 49వ డివిజన్ భాగ్యనగర్‌లో బాలాజీ సూపర్ మార్కెట్ సమీపంలో యూఐడీఎఫ్ నిధులతో రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్, పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పోచమ్మ కమాన్ సమీపంలో ఎంజీఎఫ్ నిధులతో రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్, పైప్‌లైన్ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రహదారులు, డ్రెయినేజీ, తాగునీటి పైప్‌లైన్ల వంటి ప్రాథమిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో నగర అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మీ ప్రకాష్, బోయినపల్లి ప్రవీణ్ రావ్, గాజా రమ శివరాం, తెల్ల లక్ష్మీ రమేష్, పొన్నం లక్ష్మీ మొండయ్య, వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్, బండారి వేణు, వంగల పవన్, నాంపల్లి రేణుక శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు

# పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్యే

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం**
**విద్యార్థుల ఆకలిని తరిమి.. అక్షరానికి అండగా నిలవడమే ధ్యేయం**
**- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**
**కరీంనగర్‌లో రూ.8 కోట్లతో భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం**
**49,025 మంది విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం**













**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతి గదులకు రాకుండా.. వారికి నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి ఆకలిని తరిమి అక్షరానికి అండగా నిలవడమే స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు.కరీంనగర్ మార్కెట్‌యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా కలిసి సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరికరాలను పరిశీలించారు.

**విద్యే.. పిల్లలకు గొప్ప ఆస్తి**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గతంలో విద్యార్థుల ఎదుగుదలకు భూములు, నిధులు వంటి ఆస్తులు ఉండేవని, ఇప్పుడు పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని అన్నారు. ఇటీవల జరిగిన సిప్ సర్వేలో ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలను పరిశీలించినప్పుడు ఉన్నత చదువులు చదివిన కుటుంబాలే మెరుగైన స్థాయిలో ఉన్నట్లు గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. అందుకే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచుతున్నామని, ఇప్పుడు విద్యార్థులకు ఉదయమే నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తల్లిదండ్రులు మద్దతు ఇవ్వాలని కోరారు.

**ఆకలితో చదువుకు ఆటంకం ఉండొద్దు**

ఆకలితో ఉన్న పిల్లవాడు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేడని మంత్రి అన్నారు. విద్యార్థులకు ఉదయమే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఏకాగ్రత, జ్ఞానాత్మక సామర్థ్యం, తరగతి గది భాగస్వామ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల హాజరు, సమయపాలన, విద్యా పనితీరు మెరుగుపడేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు, ముఖ్యంగా ఉదయమే ఉపాధి కోసం వెళ్లే తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం ఆర్థికంగా, సమయపరంగా ఉపశమనం కల్పిస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు వంట, ఆహార నిర్వహణ బాధ్యతల నుంచి విముక్తి పొంది బోధనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

**కరీంనగర్‌లో 49,025 మందికి అల్పాహారం**

కరీంనగర్‌లో సుమారు రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌కు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ బ్రేక్‌ఫాస్ట్ సేవలు అందుతాయని చెప్పారు. మొత్తం 49,025 మంది విద్యార్థులు ప్రతిరోజూ ప్రయోజనం పొందుతారని వివరించారు. కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల విద్యార్థులకు ఈ కిచెన్ ద్వారా అల్పాహారం అందుతుందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా హుస్నాబాద్‌లో 16,544 మంది, మానకొండూర్‌లో 8,645 మంది, చొప్పదండిలో 7,481 మంది, కరీంనగర్‌లో 16,355 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని చెప్పారు. రాష్ట్రంలో ఇది ఆరవ కమ్యూనిటీ కిచెన్ అని మంత్రి తెలిపారు. ఇక్కడి నుంచి 17 మండలాల్లో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ జరుగుతుందని చెప్పారు.

**అధునాతన యంత్రాలతో ఆహార తయారీ**

కిచెన్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇడ్లీ, దోశ, పూరీ, బోండా, సాంబార్ తయారు చేసే మిషన్లు ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. పాత్రలు శుభ్రం చేసే మిషన్లు, పాల కేంద్రం, ఆహార పదార్థాల టెస్టింగ్ ల్యాబ్, కూరగాయలు కట్ చేసే మిషన్లు, కూరగాయలు కడిగే మిషన్లు, చట్నీ పౌడర్ తయారీ మిషన్లు కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. వాటి పనితీరును స్వయంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే విధమైన నాణ్యతతో, పరిశుభ్రంగా అల్పాహారం అందించడమే కేంద్రీకృత వంటశాలల ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఆహార భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ISO స్థాయి ప్రమాణాలను పాటించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. థర్మల్ ఇన్సులేటెడ్ వాహనాల ద్వారా పాఠశాలలకు సకాలంలో అల్పాహారం తరలిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఇష్టమైన, సాధారణంగా ఇళ్లలో తినే ఆహార పదార్థాలతో మెనూ రూపొందించామని, మెనూ రూపకల్పనలో NIN సహకారం తీసుకున్నామని చెప్పారు.

**వారంలో ఆరు రకాల అల్పాహారం**

సోమవారం ఇడ్లీసాంబార్, మంగళవారం పూరీఆలూ కుర్మా, బుధవారం దోశచట్నీ, గురువారం ఉప్మాచట్నీ, శుక్రవారం మిల్లెట్ ఇడ్లీసాంబార్, శనివారం బోండాచట్నీ అందిస్తామని మంత్రి వివరించారు. రోజు విడిచి రోజు విద్యార్థులకు పాలు కూడా అందిస్తామని తెలిపారు.

**కోడంగల్‌లో పైలట్ ప్రాజెక్ట్..**

2024 డిసెంబర్‌లో కోడంగల్‌లో స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని మంత్రి తెలిపారు. అక్కడ విద్యార్థుల హాజరు 75 శాతం నుంచి 90 శాతానికి పెరిగినట్లు గుర్తించామని చెప్పారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, తరగతి గది భాగస్వామ్యం, సమయపాలన మెరుగుపడినట్లు, ఆలస్యంగా పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గినట్లు తెలిపారు. కోడంగల్‌లో అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాన్ని విస్తరిస్తున్నామని చెప్పారు.

**రాష్ట్రవ్యాప్తంగా 17.72 లక్షల మంది విద్యార్థులకు**


రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,72,291 మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని విస్తరించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. 23,106 ప్రభుత్వ పాఠశాలలను కార్యక్రమం పరిధిలోకి తీసుకురానున్నామని చెప్పారు. 31 జిల్లాల్లో 31 కేంద్రీకృత మెగా/కమ్యూనిటీ కిచెన్లు ఏర్పాటు చేసే ప్రణాళిక ఉందని, వీటి కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.245 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు తెలిపారు. అల్పాహారం పంపిణీకి సుమారు 1,400 వాహనాలు, 5,000 మంది సిబ్బంది అవసరమవుతారని చెప్పారు. కేంద్రీకృత వంటశాలల ద్వారా సుమారు 15,000 ప్రత్యక్ష, 10,000 పరోక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు.

**హరే కృష్ణ మూవ్‌మెంట్‌కు ధన్యవాదాలు**

స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమంలో ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం జూ= నిధుల కింద సంస్థకు సహకరిస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమంలో భాగస్వామిగా నిలిచినందుకు తెలంగాణ ప్రభుత్వం తరఫున ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. గతంలో తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఇదే ఫౌండేషన్ ద్వారా కరీంనగర్‌లో ఆలయం నిర్మించాలని అనుకున్నామని, ఆ అంశం ప్రస్తుతం పెండింగ్‌లో ఉందని చెప్పారు. మళ్లీ ఫౌండేషన్‌తో కలిసి ఆ దిశగా ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ క్యాంటీన్లను కూడా హరే కృష్ణ మూవ్‌మెంట్ నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి విజిలెన్స్ విచారణ పూర్తయిందని, కళాశాలలకు రావాల్సిన బకాయిలను విడుదల చేస్తున్నామని మంత్రి తెలిపారు.


**విద్యార్థులతో కలిసి అల్పాహారం**

సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి వారితో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అనంతరం కిచెన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి వాటి పనితీరు, ఆహార తయారీ, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




## ఓజోన్ పొరను రక్షించండి మన భవిష్యత్తును రక్షించండి!”

**• ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన కల్పించిన అర్వా మెహ్రీన్..**




**కరీంనగర్, సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్, అత్తాపూర్‌లోని ఎనారా హైస్కూల్‌లో 2వ తరగతి చదువుతున్న, పర్యావరణం పట్ల అమితమైన ఆసక్తి గల యువతి అర్వా మెహ్రీన్, కరీంనగర్‌లోని బొమ్మకల్‌లో ఉన్న ‘ది లెర్నింగ్ వరల్డ్ స్కూల్‘లో ఓజోన్ పొర పరిరక్షణ ప్రాముఖ్యతపై ఒక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో, సూర్యుని నుండి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుండి భూమిని కాపాడటంలో ఓజోన్ పొర పోషించే పాత్రను అర్వా వివరించారు. రంగురంగుల విద్యాసంబంధ పోస్టర్‌ను ఉపయోగించి, మానవ ఆరోగ్యం, మొక్కలు, జంతువులు, పర్యావరణానికి ఓజోన్ పొర యొక్క ప్రాముఖ్యతను ఆమె ప్రముఖంగా తెలియజేశారు.పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, హానికరమైన ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, శక్తిని ఆదా చేయాలని, వ్యర్థాలను తగ్గించాలని మరియు మరిన్ని చెట్లను నాటాలని కూడా ఆమె విద్యార్థులను ప్రోత్సహించారు.పర్యావరణ బాధ్యతను అర్థం చేసుకుని, ఆరోగ్యకరమైన గ్రహం వైపు చిన్న చిన్న అడుగులు వేసేలా యువతను ప్రేరేపించడమే ఈ అవగాహన సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశం.

## బెంగాలీ భాషలోకి సబ్బని ‘అవ్వ’ స్మృతి కవిత..



**కరీంనగర్, సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ కవి సబ్బని లక్ష్మీనారాయణ రచించిన “అవ్వ (స్మృతి కవిత)” బెంగాలీ భాషలోకి “అవ్వ ఏక్తీ ఎలిజి” పేరుతో అనువాదమైంది. ప్రముఖ బెంగాలీ కవయిత్రి కాబేరి చటోపాధ్యాయ ఈ కవితను బెంగాలీలోకి అనువదించారు.బుధవారం కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన నివాసంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. సుమారు 50 పుస్తకాలు రచించిన సబ్బని లక్ష్మీనారాయణ సాహిత్య కృషిని, ‘అవ్వ’ కవిత ఐదు భాషల్లోకి అనువాదం కావడాన్ని బండి సంజయ్ అభినందించారు.ఇప్పటికే ఈ కవిత ఇంగ్లీష్, ఫ్రెంచ్, జపనీస్ భాషల్లోకి అనువాదం కాగా, తాజాగా బెంగాలీలోకి అనువాదమైంది. కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభారాణి, ఇంజనీర్ కోలా అన్నారెడ్డి, శ్రీ అరబిందో సొసైటీ కార్యదర్శి ఉప్పల రామేశం, ఎలగందుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఈపీఎఫ్ వేతన పరిమితి పెంపుపై బీఎంఎస్ హర్షం..



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తప్పనిసరి వేతన పరిమితిని నెలకు రూ.15,000 నుంచి రూ.25,000కు పెంచుతూ కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం పట్ల భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది బీఎంఎస్ పోరాటాల ఫలితమేనని సురేష్ పేర్కొని బుధవారం రోజున పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయం ద్వారా దేశవ్యాప్తంగా 51 లక్షలకు పైగా అదనపు ఉద్యోగులు తప్పనిసరి ఈపీఎఫ్ఓ పరిధిలోకి వస్తారని, ఉద్యోగులకు భవిష్య నిధి , పెన్షన్ , బీమా రక్షణ మరింత విస్తృతంగా లభిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ‘వికసిత్ భారత్‌ఏ2047’ లక్ష్యాన్ని సాధించే దిశలో పెరుగుతున్న వేతనాలకు అనుగుణంగా కార్మికులకు దీర్ఘకాలిక పదవీ విరమణ భద్రత కల్పించే దిశగా ఇది కీలక అడుగు పడిందన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి ఊర చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి: ఇరిగేషన్ ఎస్ఈకి బీజేపీ నేతల ఫిర్యాదు



**కరీంనగర్ జిల్లా సెప్టెంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):** కొత్తపల్లి పట్టణంలోని చారిత్రాత్మక ‘ఊర చెరువు‘ ఆక్రమణలు, అక్రమ లేఅవుట్లపై నీటిపారుదల శాఖ అధికారులకు తీవ్ర నిరసన వ్యక్తమైంది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో జరుగుతున్న అక్రమాలపై మాజీ బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేంచ శేఖర్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఇరిగేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ మిట్టపల్లి రమేష్‌కు వినతిపత్రం అందజేసి, ఫిర్యాదు చేయడం జరిగింది. కొత్తపల్లి ఊర చెరువుకు సంబంధించిన సర్వే నంబర్లు 686, 687 పరిధిలో రియల్ ఎస్టేట్ బ్రోకర్లు అక్రమంగా మట్టి నింపుతూ లేఅవుట్లు చేస్తుండటాన్ని బీజేపీ నేతలు తీవ్రంగా ఖండించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల అండతోనే చెరువును ఆక్రమించుకుని, నీటి వనరులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. రోడ్డుపై ఉన్న కల్వర్టును సైతం కాంగ్రెస్ నాయకుడు కూల్చివేయడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.చెరువు ఆక్రమణల పట్ల అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, లేనియెడల భవిష్యత్తులో తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. తక్షణమే ఊర చెరువును కాపాడి, ఆ ప్రాంత రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముత్తునూరి హరీష్, మేకల నరేష్, దుబాయ్ సునీల్, మహేష్, హరిబాబు, ప్రవీణ్, శివ రమేష్, ప్రశాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# యూపీఐపై భారం వద్దు..

**- సామాన్యుడి డిజిటల్ చెల్లింపులకు రక్షణ కల్పించాలి**
**- పేదోడి చేతిలోని డిజిటల్ చెల్లింపునూ భారంగా మార్చొద్దు**
**- యూపీఐపై ప్రతిపాదిత చార్జీలపై నూతి సత్యనారాయణ గౌడ్ ఆగ్రహం..**
**- ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడకుండా కేంద్రం స్పష్టమైన భరోసా ఇవ్వాలని డిమాండ్**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** టీ కొట్టు నుంచి కూరగాయల బండి వరకు సామాన్య ప్రజల రోజువారీ జీవితంలో భాగమైన డిజిటల్ చెల్లింపులపై అదనపు ఆర్థిక భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యూపీఐ చెల్లింపులపై చార్జీల అంశం సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారుల్లో ఆందోళన కలిగించేలా ఉందని ఆయన పేర్కొన్నారు. యూపీఐ పేమెంట్లపై చార్జీల అంశంపై స్పందించిన నూతి సత్యనారాయణ గౌడ్ కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించిన తరువాత అదే వ్యవస్థలో రుసుముల పేరుతో ప్రజలపై అదనపు భారం పడే పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. **సామాన్యుడి ప్రతి రూపాయికీ విలువ ఉంది :** రోజువారీ కూలీ చేసుకునే కార్మికుడు, చిన్న ఉద్యోగి, చిరు వ్యాపారి, రైతు, పండ్లుకూరగాయలు విక్రయించే వ్యక్తి వంటి కోట్లాది మంది ప్రజలకు ప్రతి రూపాయి విలువైనదని గౌడ్ అన్నారు. చిన్న మొత్తాల చెల్లింపుల విషయంలో కూడా అదనపు ఖర్చు ఏర్పడితే దాని ప్రభావం చివరకు సామాన్య కుటుంబాలపైనే పడే అవకాశం ఉందన్నారు. "డిజిటల్ చెల్లింపులు ప్రజల జీవితాలను సులభతరం చేయాలి కానీ అదనపు భారంగా మారకూడదు. ప్రజలు సులభంగా, భద్రంగా, ఎలాంటి అనవసర రుసుములు లేకుండా డిజిటల్ చెల్లింపులు చేసుకునే వాతావరణాన్ని కొనసాగించాలి" అని ఆయన అన్నారు. కార్పొరేట్ రంగానికి అనుకూల విధానాలపై ప్రభుత్వం సమీక్ష జరపాలని, అదే సమయంలో సామాన్యులు, చిన్న వ్యాపారులపై పడే ప్రతి అదనపు ఆర్థిక భారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలు ప్రజల ఆర్థిక సౌలభ్యానికి ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. **ప్రజల్లో అపోహలు రాకుండా స్పష్టత అవసరం :** తాజా కేంద్ర ప్రభుత్వ వివరణ ప్రకారం, వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే (పి2పి) యూపీఐ లావాదేవీలు మొత్తంతో సంబంధం లేకుండా ఉచితంగానే కొనసాగుతాయి. అలాగే వ్యాపారులకు రూ. 2,000 వరకు చేసే చెల్లింపులు, నిర్దిష్ట జీరో–ఎండీఆర్ పరిధిలోని చిన్న వ్యాపారుల లావాదేవీలు కూడా ఉచితంగా ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. సుమారు 96 శాతం పి 2 ఎం లావాదేవీలపై కొత్త ఫ్రేమ్‌వర్క్ ప్రభావం ఉండదని కేంద్రం స్పష్టం చేసింది. అయితే ఎంపిక చేసిన రూ. 2,000కు పైబడిన వ్యాపారి లావాదేవీలకు మర్చంట్ డిస్కౌంట్ రేట్ (యండిఆర్) వర్తించే విధానం తీసుకొచ్చిన నేపథ్యంలో, దాని భారం చివరకు వినియోగదారులపై మోపకుండా స్పష్టమైన రక్షణలు ఉండాలని నూతి సత్యనారాయణ గౌడ్ కోరారు. ప్రభుత్వం ప్రకటించే నిబంధనలు సామాన్యులకు అర్థమయ్యే విధంగా పారదర్శకంగా ఉండాలని అన్నారు. **డిజిటల్ భారత్ లక్ష్యం ప్రజల సౌకర్యమే కావాలి :** డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ విస్తరించడంతో చిన్న వ్యాపారులు, చిరు దుకాణదారులు, సామాన్య వినియోగదారులకు నగదు రహిత లావాదేవీలు సులభతరమయ్యాయని గౌడ్ అన్నారు. అలాంటి వ్యవస్థలో ప్రజల విశ్వాసం దెబ్బతినకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రజల రోజువారీ అవసరాలకు ఉపయోగపడే డిజిటల్ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడంతో పాటు, పేదలు, మధ్యతరగతి కుటుంబాలు, చిన్న వ్యాపారులపై అదనపు భారం పడకుండా చూడాలని డిమాండ్ చేశారు. యూపీఐపై చార్జీల అంశంలో ప్రజల ప్రయోజనాలను అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని, అవసరమైతే విధానాన్ని పునఃసమీక్షించాలని కోరారు. ప్రజలపై అదనపు భారం పడే ఏ నిర్ణయమైనా కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని, ప్రజల ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనలు చేపడతామని నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడం సిగ్గుచేటు

**● బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 16(పిసి డబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించకపోవడం వెనుక రాజకీయ భయాలున్నాయని బీజేపీ మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ విమర్శించారు. రజాకార్ల వారసుల పార్టీకి భయపడే కాంగ్రెస్ పార్టీ ఈ చారిత్రాత్మక దినాన్ని విస్మరిస్తోందని ఆయన మండిపడ్డారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడంపై ఆయన ఫైర్ అయ్యారు., దేశానికి ఆగస్ట్ 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, నిజాం నిరంకుశ పాలన మరియు రజాకార్ల రాక్షస కాండ నుండి తెలంగాణ ప్రజలకు పూర్తి విముక్తి లభించింది మాత్రం సెప్టెంబర్ 17నే అని, అదే తెలంగాణకు నిజమైన స్వాతంత్ర్య దినమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, రజాకార్ల వారసుల కనుసన్నల్లో నడుస్తున్న పార్టీలకు భయపడే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి వెనుకాడుతోందని ఆరోపించారు. వీరోచిత పోరాటాల స్మృతికి చిహ్నమైన ఈ చారిత్రాత్మక దినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ఎండి ముజీబ్ ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# 22-ఏ నిషేధిత జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలి

**● భూమి ఉన్నా.. రిజిస్ట్రేషన్‌కు నోచుకోని ప్రజల కష్టాలు తీర్చాలి**
**● తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తరతరాలుగా తమ కుటుంబాల ఆధీనంలో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఉన్నప్పటికీ, 22–ఏ నిషేధిత జాబితాలో పేర్లు ఉండటం వల్ల రిజిస్ట్రేషన్లు జరగక సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు ఉద్దేశించిన నిబంధనల వల్ల నిజమైన పట్టాదారులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయం పిలుపు మేరకు డా. వాసిరెడ్డి రామనాథం ఆధ్వర్యంలో ప్రతినిధులు ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామనాథం మాట్లాడుతూ... 22–ఏ నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వేతర ప్రైవేట్ పట్టా భూములు, ఇంటి స్థలాలను సమగ్రంగా పరిశీలించి నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం కోసం 22–ఏ నిబంధనలను అమలు చేయడం సమంజసమేనని, అయితే అధికారుల రికార్డుల పొరపాట్లు, సాంకేతిక కారణాల వల్ల ప్రైవేట్ పట్టా భూములు, ఇంటి స్థలాలు కూడా నిషేధిత జాబితాలో చేరడం వల్ల అమాయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. **తరతరాలుగా అనుభవిస్తున్న భూమిపై హక్కు ఉన్నా.. రిజిస్ట్రేషన్‌కు అడ్డంకులు :** చాలా గ్రామాల్లో ప్రజలు తమ తాతలు, తండ్రుల కాలం నుంచి భూములను అనుభవిస్తూ, పట్టాదారు పాస్‌బుక్లు, ఇతర హక్కు పత్రాలను కలిగి ఉన్నప్పటికీ 22–ఏ జాబితాలో భూములు ఉండటంతో వాటిని విక్రయించలేక, అవసరమైన సమయంలో రిజిస్ట్రేషన్ చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒక కుటుంబానికి భూమి అనేది కేవలం ఆస్తి మాత్రమే కాదని, వారి జీవనాధారం, పిల్లల భవిష్యత్తు, ఆపదలో ఆదుకునే ఆస్తిగా ఉంటుందని అన్నారు. అలాంటి భూమిపై హక్కు పత్రాలు ఉన్నప్పటికీ కేవలం రికార్డుల్లోని పొరపాట్ల కారణంగా రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేకపోవడం వల్ల సామాన్య కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. **రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలి :** సంబంధిత రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ భూములు కాని ప్రైవేట్ పట్టా భూములు, ఇంటి స్థలాలను గుర్తించి 22–ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రామనాథం కోరారు. అర్హులైన పట్టాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ప్రజలు తమ భూముల విషయంలో కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా, గ్రామస్థాయిలోనే సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భూ హక్కుల విషయంలో నిజమైన పట్టాదారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండబాల కరుణాకర్, వనమా వాసు, మల్లాది హనుమంతరావు, అరెం వరలక్ష్మి, అరెం రామయ్య, తాత సుధాకర్, నాగార్జున శ్రీను, వాసిరెడ్డి భాస్కరరావు, మందపల్లి కోటి, మంద వెంకటనారాయణ, నూక హనుమంతరావు, మారేడు పుల్లారావు, పాలడుగు కృష్ణప్రసాద్, మేకల సత్యవతి, మందపల్లి రజిని, నల్లమాస మల్లయ్య, నల్లమల శ్రీను, రాయల కోటేశ్వరరావు, అశ్వినీకుమార్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల పనిభారాన్ని తగ్గించండి

**- కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించండి**
**- కార్మికుల కష్టాలు తీరితేనే ప్రజలకు మెరుగైన ఆర్టీసీ సేవలు**
**- ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి, రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు**





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నిత్యం వేలాది మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చే ఆర్టీసీ కార్మికుల సంక్షేమాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి, రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు లు అన్నారు. కార్మికులపై పెరుగుతున్న పని భారాన్ని తగ్గించి, న్యాయమైన సమస్యలను పరిష్కరించినప్పుడే ఆర్టీసీ సేవలు మరింత మెరుగుపడి ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల ఐక్య పోరాటాల వేదిక స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఖమ్మంలోని సీహెచ్‌ఎం రామయ్య స్మారక భవనం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించగా, యూనియన్ ప్రతినిధులు పతాకానికి రెడ్ సెల్యూట్ చేశారు. అనంతరం రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఖమ్మం డిపో వద్ద కార్మికులపై పెంచిన పని భారాన్ని తగ్గించాలని, స్థానిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. గడ్డం వెంకటయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి మాట్లాడుతూ.. తెలంగాణ ఆర్టీసీలో యాజమాన్య విధానాల కారణంగా కార్మికులపై విపరీతమైన పని భారం పెరుగుతోందని అన్నారు. గత ఏప్రిల్‌లో కార్మిక సంఘాల ఐక్య పోరాటంలో భాగంగా జరిగిన మూడు రోజుల సమ్మె సందర్భంగా పలు అంశాలపై చర్చించి పరిష్కారానికి అంగీకరించినప్పటికీ, వాటి అమలులో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల స్థాయిలో జరిగిన చర్చల్లో అంగీకరించిన 17 అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నప్పటికీ, డిపో, రీజియన్ స్థాయిలో కార్మిక సంఘాలతో చర్చించకుండా 'స్మార్ట్ షెడ్యూల్' పేరుతో అదనపు పని భారాన్ని మోపుతున్నారని లింగమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, కార్మికులకు రావాల్సిన 2017, 2021 పీఆర్సీ ఏరియర్స్‌ను అందించాలని, అన్ని కేటగిరీల్లో ఖాళీలను భర్తీ చేసి సిబ్బంది కొరతను అధిగమించాలని కోరారు. ఆర్టీసీకి నష్టాలు వస్తే అందుకు కార్మికులు కారణం కాదని, యాజమాన్య నిర్ణయాలను సమీక్షించి ప్రజలకు, సంస్థకు ఉపయోగపడే విధంగా సర్వీసులను నిర్వహించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్‌లో మరింత విస్తృత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు, ఉపాధ్యక్షులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి తోకల బాబు మాట్లాడుతూ... ఖమ్మం రీజియన్‌లో కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అధికంగా రిక్వెస్ట్ స్టేజీలు ఏర్పాటు చేయడం వల్ల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మహిళా ఉద్యోగులు రాత్రి వేళల్లోనూ విధులు నిర్వహిస్తున్నందున, వారి ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని బస్టాండ్లలో తగిన విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రయాణికులకు ఉపయోగకరంగా, ఆదాయం వచ్చే డీలక్స్ సర్వీసులను రద్దు చేయకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా వాటిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. **కార్మికుల సమస్యల పరిష్కారమే ప్రజా సేవకు బలం** ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌తో పాటు ఇతర సిబ్బంది కూడా ప్రతిరోజూ సమయపాలన, ఒత్తిడి, సిబ్బంది కొరత, అదనపు విధుల మధ్య ప్రజా రవాణా వ్యవస్థను నడిపిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. వారి పని పరిస్థితులు మెరుగుపడితేనే ప్రయాణికులకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన సేవలు అందించగలమని అన్నారు. కార్మికుల సంక్షేమాన్ని సంస్థ బలోపేతంతో ముడిపెట్టి చూడాలని కోరారు. **డిపో సమస్యలపై వినతిపత్రం :** అనంతరం ఖమ్మం డిపో కార్యదర్శి గుగ్గిళ్ల రోశయ్య స్థానిక డిపోలోని సమస్యలను వివరించారు. పెంచిన సర్వీసులు, ఓవర్‌టైమ్, డ్యూటీ చార్టులు, మహిళా ఉద్యోగుల విధులు, సిబ్బంది కొరత, బస్సుల నిర్వహణ, టిమ్ మిషన్ల సమస్యలు తదితర అంశాలను పరిష్కరించాలని కోరుతూ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్ సత్యనారాయణకు యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఓటీపీఎం, ఓటీఈబీ, ఓవైఎస్టీ, ఓజేకేఎం సర్వీసులకు పెంచిన ట్రిప్పులకు అనుగుణంగా ఓవర్‌టైమ్ చెల్లించాలని లేదా పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఇల్లందు రూట్‌లో స్పెషల్ ఆఫ్ డ్యూటీలను యథాతథంగా కొనసాగించాలని, సూర్యాపేట పల్లెవెలుగు సర్వీసులకు కిలోమీటర్లకు అనుగుణంగా ఓవర్‌టైమ్ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పాత బస్టాండ్‌లో షెడ్యూల్ సర్వీసుల నిర్వహణ, డ్యూటీ ముగిసిన తర్వాత అదనపు ట్రిప్పులు కేటాయించడం వంటి సమస్యలను పరిష్కరించాలని, డ్రైవర్లు, కండక్టర్లపై వేధింపులు లేకుండా చూడాలని కోరారు. డ్యూటీ చార్ట్ కౌన్సెలింగ్‌ను వెంటనే నిర్వహించి, టిమ్ డ్రైవర్ల డ్యూటీ చార్టులో అన్ని సర్వీసులను పొందుపరచాలని తెలిపారు. కోదాడ నాన్‌స్టాఫ్ సర్వీసులను ప్రయాణికుల సౌకర్యార్థం యథాతథంగా నడపాలని, మహిళా ఉద్యోగులకు వీలైనంత వరకు రాత్రి 8 గంటలలోపు డ్యూటీ ముగిసేలా సర్వీసులు కేటాయించాలని కోరారు. అన్ని కేటగిరీల్లో తగినంత సిబ్బందిని నియమించి పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. బీఎస్–6 సహా అన్ని బస్సులకు నాణ్యమైన స్పేర్‌పార్ట్స్ అందుబాటులో ఉంచాలని, సైడ్ మిర్రర్లు, హెడ్‌లైట్లు, సెన్సార్లు, ఫిల్టర్లు, సస్పెన్షన్ రబ్బర్ బ్లేడ్లు తదితరాలను సకాలంలో మార్చాలని కోరారు. ఎర్నింగ్ సెక్షన్‌లో ఏసీలు మరమ్మతు చేయడంతో పాటు అదనపు సిబ్బందిని కేటాయించాలని, టిమ్ మిషన్లకు కవర్లు, ప్రింటర్లకు అవసరమైన పరికరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. డ్రైవర్లపై కేఎంపీఎల్, కండక్టర్లపై ఫెయిర్ పెయిడ్ ఈపీకే అంశాల్లో అనవసర వేధింపులు లేకుండా చూడాలని, డిపోలో సిబ్బంది వాహనాల పార్కింగ్‌ను మెరుగుపరచాలని కోరారు. ఆర్.వి. బాబు, ఓ. రాంబాబు, ఎస్.ఎస్. రామయ్య, జే.యు. చారి, పగిళ్లపల్లి నరసింహారావు, సి.హెచ్. వీరయ్య, కె. వెంకన్న, ఐ. ముత్తయ్య, జి. వెంకటేశ్వర్లు, కె. శ్రీను, వీరేందర్ రావు, యన్వీ చారి, ఏ. శ్రీనివాసు, డి. నాగయ్య, రాజనాల నాగమల్లేశ్వరరావు, బి. సుధాకర్, ఎం. వసంతరెడ్డి, రంగా రామారావు, ఎం. వెంకటేశ్వర్లు, పి. విజయ్‌కుమార్, కృష్ణమూర్తి, కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పునరుద్ధరణకు ఫార్మ్ కుంటలు ఎంతో ఉపయోగకరం

**● ఎస్.లింగోటంలో ఫార్మ్ కుంట నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ**

**చౌటుప్పల్, సెప్టెంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఫార్మ్ కుంటలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని స్వాములవారి లింగోటం గ్రామ సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమిడి ప్రదీప్ జీ అన్నారు. బుధవారం ఎస్.లింగోటం గ్రామంలోని శివుని బావి చెల్కలో జలసిరి కార్యక్రమంలో భాగంగా ఫార్మ్ కుంట నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ వర్షం ఎప్పుడు పడుతుందో మన చేతుల్లో లేకపోయినా, పడిన వర్షపు నీటిని సంరక్షించుకోవడం మన చేతుల్లోనే ఉందన్నారు. ఫార్మ్ కుంటల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయడంతో భూగర్భ జలాల పెంపు, నేలలో తేమ నిల్వ, పంటలకు నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. రైతుల భవిష్యత్తు, గ్రామంలో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని మరిన్ని ఫార్మ్ కుంటలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

## ఆసియా గేమ్స్‌లో టీమ్ఇండియాకు
# విప్రజ్ నిగమ్ ఎంపిక




ఒక ఆటగాడి గాయం కారణంగా ఇంకో ఆటగాడికి జట్టులో చోటు దక్కడం ఏ ఆటలోనైనా మామూలుగా జరిగేదే. తాజాగా టీమ్ఇండియా జాతీయ జట్టులోనూ అదే జరిగింది. అయితే ఈసారి జట్టులో చోటు దక్కించుకోనున్న ప్లేయర్‌కు మాత్రం ఇది అరంగేట్రం కానుండడం విశేషం. గతేడాది ఐపీఎల్‌లో టోర్నమెంట్‌లో రాణించిన 22ఏళ్ల దిల్లీ క్యాపిటల్స్ బౌలర్‌కు ఆసియా గేమ్స్‌లో ఆడే అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. మరో మూడు రోజుల్లో ఆసియా గేమ్స్ ప్రారంభం కానున్న నేపథ్యంలో టీమ్ఇండియాకు రీసెంట్‌గా ఎదురుదెబ్బ తగిలింది. దిల్లీ వేదికగా ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 'సైడ్ స్ట్రెయిన్' (పక్కటెముకల వద్ద కండరాల గాయం)కు గురయ్యాడు. దీంతో అతడు ఈ సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే ఈ సిరీస్‌తోపాటు వరుణ్ ఆసియా గేమ్స్ నుంచి కూడా దూరమయ్యాడు. దీంతో సెలక్టర్లు అతడి రిప్లేస్‌మెంట్‌గా ఐపీఎల్ స్టార్, స్పిన్ ఆల్‌రౌండర్ విప్రజ్ నిగమ్‌ను ఎంపిక చేసినట్లు ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ తమ రిపోర్ట్‌లో పేర్కొంది. "గాయం కారణంగా వరుణ్ కొద్దిరోజులు అందుబాటులో ఉండడు. అతడు గాయం నుంచి కోలుకోవాల్సి ఉంది. దీంతో అతడు ఈ పోటీలకు దూరమయ్యాడు. అయితే అతడి రిప్లేస్‌మెంట్ కోసం సెలక్టర్ల జాబితాలో విప్రాజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్ ఇద్దరి పేర్లు ఉన్నాయి. అయితే లెగ్ స్పిన్నర్ కమ్ ఆల్‌రౌండ్ విప్రజ్ నిగమ్ వైపే సెలక్టర్లు మొగ్గు చూపించారు. రాబోయే ఆసియా గేమ్స్‌లో వరుణ్ స్థానాన్ని విప్రజ్ నిగమ్ భర్తీ చేయనున్నాడు" అని బీసీసీఐ వర్గాలు చెప్పినట్లు పీటీఐ పేర్కొంది. విప్రాజ్ నిగమ్ బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ మెరుపులు మెరిపించగలడు. 2025లో ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చిన అతడు ఆకట్టుకున్నాడు. ఈ టోర్నీలో తన బ్యాటింగ్ నైపుణ్యాన్ని కూడా ప్రదర్శించాడు. టీ20ల్లో స్ట్రైక్ రేట్ 176గా ఉండడం విశేషం. విప్రాజ్ బంతితో రాణించడమే కాకుండా, లోయార్డర్‌లో వేగంగా పరుగులు సాధించగల సామర్థ్యం అతడికి ఉంది. కాగా, ఆఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో 35 ఏళ్ల వరుణ్ చక్రవర్తి గాయపడ్డాడు. మ్యాచ్ తర్వాత అతను అసౌకర్యంగా ఉన్నట్లు తెలిపాడు. ఆ తర్వాత అతడికి ఎమ్ఆర్ఐ స్కాన్ చేయించగా, పక్కటెముకల్లో గాయం ఉన్నట్లు తేలింది. దీంతో అతడిని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'కు పంపించారు. అక్కడ కొన్ని రోజులు రిహాబిలిటేషన్ చేయనున్నాడు. ఇటీవలే హ్యామ్‌స్ట్రింగ్ సమస్య నుంచి కోలుకుని జాతీయ జట్టులోకి తిరిగి వచ్చిన వరుణ్ మళ్లీ తొలి మ్యాచ్‌లోనే గాయపడడం అతడికి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. కాగా, కుల్దీప్‌ను కాదని విప్రజ్‌ను ఎంపిక చేయడంపై ఓ కారణం ఉంది. ఈనెలలో ఆఖరి వారంలో భారత్ జట్టు వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ ఆడాల్సి ఉంది. ఇందులో కుల్దీప్ బరిలో దిగనున్నాడు. అందుకే విప్రజ్‌ను ఆసియా గేమ్స్‌కు పంపించారు. జపాన్‌లోని ఐచి- నగోయాలో సెప్టెంబర్ 19 నుంచి ఆసియా క్రీడలు ప్రారంభం కానున్నాయి. పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24న మొదలవుతాయి. అయితే భారత జట్టు నేరుగా క్వార్టర్-ఫైనల్ దశ నుంచే తన పోరాటాన్ని ప్రారంభిస్తుంది.

## కొచ్చి వేదికగా అక్టోబర్‌లో
# మెగా ఆక్షన్ నిర్వహణ..







### ● డబ్ల్యూపీఎల్ 2027 తేదీలు ఖరారు

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఐదో సీజన్ నిర్వహణకు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం కీలక ప్రకటన విడుదల చేసింది. డబ్ల్యూపీఎల్ 2027 ఎడిషన్ మ్యాచ్‌లను 2027 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ కొత్త సీజన్ కోసం ఆటగాళ్ల మినీ వేలాన్ని ఈ ఏడాది అక్టోబర్ 28న కేరళలోని కొచ్చి నగరంలో జరుపుతారు. అయితే ఈ టోర్నీ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే వేదికల వివరాలను మాత్రం బీసీసీఐ ప్రస్తుతానికి వెల్లడించలేదు. మహిళల క్రికెట్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్‌గా అవతరించిన డబ్ల్యూపీఎల్, సరికొత్త ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తోందని బోర్డు తన అధికారిక ప్రకటనలో తెలిపింది. ఇండియా అంతర్జాతీయ స్టార్లతో పాటు వర్ధమాన క్రీడాకారిణులు తమ సత్తా చాటేందుకు ఈ లీగ్ గొప్ప వేదికగా నిలిచింది. రాబోయే సీజన్ కోసం ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లను సిద్ధం చేసుకోవడంపై కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న జట్ల నుంచి ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి బీసీసీఐ సెప్టెంబర్ 28ని ఆఖరి గడువుగా నిర్ణయించింది. ఈ గడువు లోగా ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సమర్పించాల్సి ఉంటుందని తెలుస్తోంది. రాబోయే సీజన్‌కు సరిపడే అత్యుత్తమ కాంబినేషన్‌లను ఎంపిక చేసుకోవడానికి జట్లకు ఇది మంచి అవకాశం. 2026 ఎడిషన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సంచలన ఆటతీరుతో రెండోసారి డబ్ల్యూపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన సారథ్యంలో బరిలోకి దిగిన ఆర్సీబీ, అద్భుత ప్రదర్శనతో టైటిల్ నిలబెట్టుకుంది. ఆ సీజన్ మ్యాచ్‌లను నవీ ముంబై, బరోడాలలో విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు జరగబోయే ఐదో సీజన్‌లోనూ విజేతగా నిలిచి హ్యాట్రిక్ సాధించాలని ఆర్సీబీ బృందం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు తగిన కసరత్తు ముమ్మరం చేస్తోంది ఆ టీమ్ మేనేజ్మెంట్. 2023లో ఆరంభమైన డబ్ల్యూపీఎల్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు చెరో రెండుసార్లు ఛాంపియన్లుగా నిలిచాయి. కొచ్చిలో జరిగే వేలం తర్వాత ఐదు ఫ్రాంచైజీలు కొత్త వ్యూహాలతో బరిలోకి దిగనున్నాయని తెలుస్తోంది. ఇక మిగతా జట్లు కూడా విజేతగా నిలిచేందుకు వ్యూహాలు పన్నుతున్నాయి.

# వైభవ్‌తో పోటీ బయటి ప్రపంచానికి మాత్రమే




అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో టీ20 పోరులో 160 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమ్ ఇండియా ఏ దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా, ఆడుతూ పాడుతూ టార్గెట్ చేజ్ చేసింది. ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 88 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. కేవలం 22 బంతుల్లోనే 57 పరుగులు సాధించి సంజూ ఫామ్‌లోకి రావడంతో భారత్ 14.5 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో 15 ఏళ్ల వండర్‌కిడ్ వైభవ్ సూర్యవంశీతో పోటీ గురించి వస్తున్న ఊహాగానాలకు సంజూ తనదైన శైలిలో స్పందించాడు. ఫామ్ అనేది తాత్కాలికం, క్లాస్ ఎప్పటికీ శాశ్వతం అని మరోసారి నిరూపించాడు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఓపెనింగ్ స్థానం కోసం నెలకొన్న తీవ్ర పోటీపై అడిగిన ప్రశ్నకు సంజూ దీటుగా అన్సరిచ్చాడు. ఓపెనింగ్ బెర్త్‌ల వివాదంపై సంజూ శాంసన్ స్పందిస్తూ, "బయటి ప్రపంచానికి మాత్రమే వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ నాకు పోటీదారులుగా కనిపిస్తారు. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా ఒకే జట్టుగా దేశం కోసం ఆడుతున్నాం. మాకు జట్టు విజయం మాత్రమే ముఖ్యం, ఆ తర్వాతే వ్యక్తిగత ప్రదర్శనలు వస్తాయి. అతడికి అవకాశం ఇచ్చారు, నాకు ఎందుకు రాలేదు అని బాధపడుతూ నెగెటివ్ ఆలోచనలతో కూర్చోవడం మా జట్టు సంస్కృతిలో లేదు. అలాంటి మనస్తత్వాలు ఇక్కడ పనికిరావు" అని పేర్కొన్నాడు. సోషల్ మీడియాలో మాజీ క్రికెటర్లు చేసే వ్యాఖ్యల గురించి సంజూ శాంసన్ మాట్లాడుతూ, "సాధారణంగా నేను వైఫై ఆఫ్ చేసి నెగెటివిటీకి దూరంగా ఉంటాను. కానీ కొన్నిసార్లు ఆ కామెంట్లు నా కంట పడుతుంటాయి. ఇండియాలో ఆడుతున్నప్పుడు ఇలాంటి కామెంట్లు ఆటగాళ్లపై ప్రభావం చూపుతాయి. మేం రోబోలం కాదు, మాకు భావోద్వేగాలు ఉంటాయి. గతంలో విమర్శలు నన్ను కూడా బాధించాయి. అయితే అనుభవంతో వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాను. ఒక షాట్ ఆడే ముందు బయట ఏమనుకుంటారో అని ఆలోచిస్తే నేను ఇలా బ్యాటింగ్ చేయలేను" అని తెలిపాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో సంజూ, అభిషేక్‌లు రాణించినప్పటికీ, బెంచ్‌పై ఉన్న వైభవ్ సూర్యవంశీకి మూడో టీ20లో అవకాశం ఇస్తామంటూ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సూచన ప్రాయంగా చెప్పాడు. దీంతో ఆఖరి పోరులో ఎవరికి విశ్రాంతి ఇస్తారనేది ఆసక్తిగా మారింది. ఇక ఈ ఈ సిరీస్ ను ఇప్పటికే 2-0తో ఇండియా కైవసం చేసుకోగా, స్వదేశంలో శ్రేయస్ కిదే తొలి సిరీస్ విక్టరీ కావడం విశేషం.


# భారత్‌లోనే జరగనున్న ఐపీఎల్ 2027 వేలం



గత కొన్ని ఏళ్లుగా విదేశాల్లో ఐపీఎల్ వేలాన్ని నిర్వహించే ట్రెండ్‌కు బీసీసీఐ బ్రేక్ వేసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కీలక సమావేశంలో 2027 ఐపీఎల్ మినీ వేలాన్ని మన భారతదేశంలోనే నిర్వహించాలని నిర్ణయించారు! 2023లో కొచ్చిలో జరిగిన వేలం తర్వాత దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో వేలాలు జరిగాయి. అయితే, 2028లో నిర్వహించే మెగా వేలాన్ని మళ్లీ విదేశాల్లో నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, ఈసారి మినీ వేలాన్ని మాత్రం స్వదేశంలోనే నిర్వహించనున్నారు. మినీ వేలం కోసం తమ యాజమాన్యం, విశ్లేషకుల బృందాలను విదేశాలకు తీసుకెళ్లడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫ్రాంచైజీలు బీసీసీఐకి విన్నవించాయి. గతేడాది అబుదాబి వేలం సందర్భంగానే టీమ్స్ ఈ అభ్యంతరాలను బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాయి. ఫ్రాంచైజీల అభిప్రాయాలకు గౌరవమిస్తూ, వేలాన్ని భారతదేశంలోని ఏదో ఒక నగరంలో నిర్వహించాలని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయించింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలం భారతదేశంలో వివాహాల సీజన్ కావడంతో, వేలం వేదిక ఎంపిక కాస్త సవాలుగా మారింది. వేలం నిర్వహణతో పాటు 10 ఫ్రాంచైజీల బృందాలు, బీసీసీఐ అధికారుల వసతి కోసం కనీసం 100కి పైగా 5-స్టార్ హోటల్ గదులు రెండు రోజుల పాటు అవసరం అవుతాయి. హోటల్ గదుల లభ్యతను బట్టి ఏ భారతీయ నగరంలో వేలం నిర్వహించాలనేది త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. మరోవైపు ఐపీఎల్‌లో ఎంతో వివాదాస్పదమైన 'ఇంపాక్ట్ ప్లేయర్' నియమంపై బీసీసీఐ ఇంకా ఏటూ తేల్చలేదు. ఈ రూల్‌ను కొనసాగించాలా వద్దా అనే దానిపై ఫ్రాంచైజీలలో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. జట్టు నిర్మాణాన్ని ఈ నియమాన్ని బట్టే రూపొందించుకున్నామని, కాబట్టి దీనిపై హడావుడిగా కాకుండా వచ్చే ఏడాది నిర్ణయం తీసుకోవాలని కొన్ని జట్లు కోరుతున్నాయి. దీనిపై స్పష్టత కోసం మరో నెల రోజుల్లో ప్రత్యేకంగా గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం కానుంది.

## స్విమ్మింగ్‌లో మెరిసిన
# మనీశ్ గౌడ్

### - ఓయూ ఇంటర్‌కాలేజ్ స్విమ్మింగ్ పోటీలు




**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్శిటీ ఇంటర్ కాలేజ్ స్విమ్మింగ్ పోటీల్లో కె. మనీశ్ గౌడ్ (సెయింట్ జోసెఫ్ కాలేజ్) సత్తా చాటాడు. మెన్స్ 100 మీటర్ల, 200మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో పసిడి పతకం సాధించాడు. 50మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజత పతకం నెగ్గాడు. బద్రుకా కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు అంబర్‌పేట్ స్విమ్మింగ్‌పూల్‌లో జరుగగా.. ఎన్‌జిఐటి, ఎసీఎంఈ, కేశవ్ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజ్‌లు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాయి. ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ప్రొ. సునీల్ కుమార్, ఐయూటీ సెక్రటరీ ప్రొ. దీప్ల, బద్రుకా కాలేజ్ ప్రిన్సిపాల్ మోహన్ కుమార్‌లు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

# అనంత్ నాగ్‌కు ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం

**- ఈ నెల 22న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రధానం**



ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్‌ను సినీ రంగంలో అత్యున్నత ప్రతిష్టాత్మక పురస్కారం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. 2024 సంవత్సరానికి ఆయనకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భారతీయ సినిమాకు అనంత్ నాగ్ అందించిన సేవలు, విశిష్టమైన సినీ ప్రస్థానానికి గుర్తింపుగా ఈ పురస్కారం అందించినట్లు కేంద్రం తెలిపింది. గుజరాత్‌లోని కేవడియాలో ఈ నెల 22న జరగనున్న 72వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రధానోత్సవంలో అనంత్ నాగ్‌కు... రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారం అందజేయనున్నారు. కన్నడతో పాటు పలు భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు అనంత్ నాగ్. ఆయనకు అత్యున్నత పురస్కారం దక్కడం పట్ల కన్నడ ఇండస్ట్రీతో పాటు సినీ అభిమానులు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.నటుడు అనంత్ నాగ్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారంతో సత్కరించబడిన ప్రఖ్యాత నటుడు అనంత్ నాగ్ గారికి అభినందనలు. గత కొన్ని దశాబ్దాలుగా, ఆయన సహజ నటన, అద్భుతమైన బహుముఖ ప్రజ్ఞ, అసాధారణమైన కళా నైపుణ్యం భారతీయ సినిమాపై, ముఖ్యంగా కన్నడ చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేశాయి. ఆయన పోషించిన ప్రతి పాత్రలోనూ సాటిలేని నటనను, జీవాన్ని నింపారు. ఒక గొప్ప కళాకారుడికి ఇది నిజంగా దక్కిన అర్హమైన గౌరవం.' అంటూ పోస్ట్ చేశారు. దాదాపు 5 దశాబ్దాల సినీ ప్రయాణంలో అనంత్ నాగ్... కన్నడతో పాటు తెలుగు, హిందీ, మరాఠీ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు. తన నటనతో ఎంతో మంది ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారు. థియేటర్ నటుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన... 1973లో కన్నడ మూవీ 'సంకల్ప'తో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత మంథన్, కొండుర, కల్‌యుగ్ తదితర చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి.ఆర్కే నారాయణన్ కథల ఆధారంగా తెరకెక్కించిన ఫేమస్ టీవీ సీరియల్ 'మాల్గుడి డేస్'లో అనంత్ నాగ్ మిఠాయి వాలా పాత్రతో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు. అలాగే, రాజ కుమార, గాలిపట 2, కేజీఎఫ్, కన్నేశ్వర రామ వంటి మూవీస్ మరింత పేరు తీసుకొచ్చాయి. తెలుగులో భీష్మ, బాలు, అనుగ్రహం, శంఖారావం వంటి చిత్రాల్లో నటించారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 2025లో 'పద్మ భూషణ్'తో గౌరవించింది. ఇప్పుడు అత్యున్నత దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందించనుంది.

# వేగం పెంచిన 'ధర్మన్'




సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'ధర్మన్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మూడో షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని దర్శకుడు అశ్వత్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. షూటింగ్ సెట్స్ నుంచి ఒక ఆసక్తికరమైన బిహైండ్-ది-సీన్స్ (బీటీఎస్) వీడియో క్లిప్‌ను ఆయన పంచుకున్నారు. ఈ వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్, నటి రాశి ఖన్నాతో ముచ్చటిస్తూ కనిపించారు. "ధర్మన్ మూడో షెడ్యూల్ కోసం మళ్లీ తలైవర్‌తో కలిశాను" అంటూ ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవలే సెప్టెంబర్ 4న ఈ చిత్ర రెండో షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్ర నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్.. రజనీకాంత్ ఒక సీనియర్ మెడికల్ ఫ్యాకల్టీగా జూనియర్ డాక్టర్లకు పాఠాలు చెబుతున్న సన్నివేశాలతో కూడిన వీడియోను విడుదల చేసింది. ఈ లుక్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రాన్ని లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్నారు. కమల్ నిర్మాణంలో రజనీ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ధర్మమే వెల్లుమ్' (ధర్మమే గెలుస్తుంది) అనే ట్యాగ్‌లైన్‌తో కమల్ హాసన్ స్వయంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఒక వైద్యుడి పాత్రలో నటిస్తూనే, సమాజంలోని నేరస్థులను శిక్షించే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో విడుదలైన టైటిల్ పోస్టర్‌లో ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ చేతిలో పట్టుకుని, ఒక రౌడీ మృతదేహంపై కాలు వేసి ఉన్న రజనీకాంత్ లుక్ సినిమాపై ఉత్కంఠను మరింత పెంచింది. ఈ చిత్రానికి యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీతలైన అన్బరివ్ ద్వయం స్టంట్స్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వరుస షెడ్యూళ్లతో సినిమాను వేగంగా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ప్రణాళికలు రచిస్తోంది.

# 'ది ప్యారడైజ్'కు సెన్సార్ పూర్తి..



నేచురల్ స్టార్ నాని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్' సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఏ సర్టిఫికేట్ జారీ చేసింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ సినిమా మొత్తం 2 గంటల 49 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం గురించి నాని మాట్లాడుతూ, తన 18 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇంతగా శ్రమించిన సినిమా మరొకటి లేదని అన్నారు. "శారీరకంగా, మానసికంగా 'ది ప్యారడైజ్' నన్ను బాగా అలసిపోయేలా చేసింది. ఇంత కష్టపడి నేను మరో సినిమాకు పనిచేయలేదు" అని ఇటీవల మీడియా సమావేశంలో తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులపై కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. "సినిమాలో నీటి అడుగున సన్నివేశాలు ఉన్నాయని, వెయ్యి మందితో ఫైట్ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. వాటిలో నిజం లేదు. ఇది ఒక వాస్తవిక కథ. యాక్షన్ సన్నివేశాలు చాలా ఉన్నాయి. హింసలో కూడా ఓ భావోద్వేగం ప్రేక్షకులకు కనపడుతుంది" అని వివరించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ, "సినిమా కాస్త ఆలస్యమైనా, విడుదలైన ప్రతి అప్‌డేట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇది ఒక విప్లవాత్మక, భావోద్వేగభరితమైన చిత్రం. తల్లీకొడుకుల కథతో పాటు, అణచివేతకు గురైన ఒక సమాజం కథ ఇది" అని అన్నారు. కాళోజీ మాటలను గుర్తుచేస్తూ, "'పుట్టుక మనది, చావు మనది, కానీ మన బతుకంతా దేశానిది' అనే వాక్యం ఈ కథకు స్ఫూర్తి. దేశం కోసం పోరాడిన ప్రజలకు, అదే దేశంలో చోటు లేనప్పుడు ఏం చేయాలో తెలియక తిరగబడటమే 'ది ప్యారడైజ్' కథ" అని తెలిపారు.




# ఓటీటీలోనూ సత్తా చాటుతోన్న విశ్వనాథ్ అండ్ సన్స్

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, మమితా బైజు జంటగా నటించిన సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ ఫ్యామిలీ డ్రామా థియేటర్లలో భారీ విజయం సాధించింది. అనంతరం సెప్టెంబర్ 11న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ మూవీ థియేటర్ రన్‌లోనే కాదు.. ఓటీటీలోనూ తన సత్తా చాటుతోంది. ఈ క్రమంలో ముఖ్యంగా దళపతి విజయ్, ప్రభాస్ సినిమాల వ్యూస్‌ను అధిగమిస్తూ సూర్య మూవీ సరికొత్త రికార్డు సృష్టించింది. 'విశ్వనాథ్ అండ్ సన్స్' తొలి వారంలోనే రికార్డు స్థాయి వ్యూస్ సొంతం చేసుకుంది. నెట్‌ఫ్లిక్స్ వెల్లడించిన గణాంకాల ప్రకారం..

ఈ సినిమా తొలి వారం (సెప్టెంబర్ 7 నుంచి 13 వరకు)లోనే 5.5 మిలియన్ వ్యూస్ సాధించింది. మొత్తం 14.6 మిలియన్ వ్యూయింగ్ అవర్స్ నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా నెట్‌ఫ్లిక్స్ నాన్-ఇంగ్లిష్ మూవీస్ ట్రెండింగ్ జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. ఈ రికార్డు బట్టి చూస్తే ఈ సినిమాకు ఇండియాలోనే కాకుండా విదేశీ మార్కెట్లలోనూ ప్రేక్షకుల ఆదరణ లభిస్తోంది. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రస్తుతం ఈ సినిమా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులో ఉంది. 5.5 మిలియన్ వ్యూస్‌తో 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. 2026లో థియేటర్ల తర్వాత ఓటీటీలోకి వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో టాప్ లో నిలిచింది. అంతకుముందు విజయ్ మూవీ బ్లాస్ 4.4 మిలియన్ వ్యూస్‌తో టాప్ ఉండగా.. సూర్య సినిమా ఆ రికార్డును బ్రేక్ చేసింది. కరా 3.8 మిలియన్, జననాయగన్ 3.6 మిలియన్, ప్రభాస్ 'రాజాసాబ్ 3.4 మిలియన్ వ్యూస్‌తో తదుపరి స్థానాల్లో నిలిచాయి. అంటే సూర్య సినిమా థియేటర్లలో సాధించిన విజయాన్ని ఓటీటీ రిలీజ్ తర్వాత కూడా కొనసాగించిందని చెప్పొచ్చు. ఇదే సమయంలో మరో రికార్డు నమోదైంది. నెట్‌ఫ్లిక్స్‌లో థియేట్రికల్ రిలీజ్ తర్వాత స్ట్రీమింగ్‌కు వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఆల్‌టైమ్ ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో 'విశ్వనాథ్ అండ్ సన్స్' 5.5 మిలియన్ వ్యూస్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో అల్లు అర్జున్ పుష్ప 2 5.8 మిలియన్ వ్యూస్‌తో మొదటిస్థానంలో ఉండగా.. ఆ తర్వాత 'విశ్వనాథ్ అండ్ సన్స్' 5.5 మిలియన్‌తో నిలిచింది. ఇడ్లీ కాడాయి 5.2 మిలియన్, లక్కీ భాస్కర్ 5.1 మిలియన్, బాస్ట్ 4.4 మిలియన్ వ్యూస్‌తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# న్యూ ఏజ్ మ్యూజికల్ ఫిల్మ్




హెచ్.టీ సినిమాస్ ఎల్.ఎల్.పి బ్యానర్‌పై హేమల్ తుమ్మపూడి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కనున్న తొలి చిత్రం 'పాటకు ప్రాణం'. ఈ సినిమా బుధవారం ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి దర్శకులు సురేందర్ రెడ్డి, హీరో నిఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సంగీతానికి, భావోద్వేగాలకు ప్రాధాన్యతనిస్తూ తెరకెక్కనున్న ఈ చిత్రంలో సుదర్శన్, సాత్విక జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానుందని దర్శక, నిర్మాత హేమల్ తుమ్మపూడి తెలిపారు. వైవిధ్యమైన కథాంశంతో, సంగీతానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో, దర్శకుడు హేమల్ తుమ్మపూడి మాట్లాడుతూ , "ముందుగా మా లాంటి యువ ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇక్కడికి విచ్చేసిన మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన హీరో నిఖిల్ గారికి, దర్శకుడు సురేందర్ రెడ్డి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. మా చిత్రబృందాన్ని ఆశీర్వదించేందుకు వచ్చిన నటీనటులందరికీ ధన్యవాదాలు.సుమారు 60 ఏళ్లుగా వెనుకబడిపోయిన రామయ్య అనే వ్యక్తి, అలాగే 20 ఏళ్ల యువకుడు కలిసి ప్రారంభించే మ్యూజికల్ జర్నీ చుట్టూ మా సినిమా కథ సాగుతుంది. ఇది న్యూ ఏజ్ మ్యూజికల్ డ్రామా. సినిమాలో చాలా పాటలు ఉంటాయి. మా చిత్రానికి శేఖర్ చంద్ర అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.ఈ సినిమాను వచ్చే ఏడాది ద్వితీయార్థంలో మంచి తేదీని చూసుకుని థియేటర్లలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం అని తెలిపారు.తనికెళ్ల భరణి గారు మాట్లాడుతూ ,'ఈ సినిమాను 'శంకరాభరణం'తో పోల్చడం లేదు. అయితే ఆ సినిమాలో ఉన్న సంగీత స్ఫూర్తి ఈ సినిమాలో కూడా కనిపిస్తుంది. ఈ చిత్రంలో ఒక పాత తరం సంప్రదాయ సంగీత విద్వాంసుడికి, ఈ తరం జెన్-జెడ్ సంగీతకారుడికి మధ్య ఉండే ఆసక్తికరమైన కలయికను చూపించబోతున్నారు' అని అన్నారు.